నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 27 ఏప్రిల్ 2024 | RANGAREDDY

## గ్యారెంటీలన్నీ గోవిందా..

- అధికారం వచ్చాక చిటికేస్తే సాలన్నరు..
- ప్రతి స్కీంలో మోసం.. ప్రతి విషయంలో దగా..
- కాంగ్రెస్, బీజేపీకి ఓటెందుకు వెయ్యాలి..?
- పాలమూరు కార్నర్ మీటింగ్‌లో కేసీఆర్ నిప్పులు
- అధినేత ప్రసంగానికి ప్రజల ఫిదా


'అధికారంలో వస్తే చిటికేస్తే పనులు అయితయన్నరు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చారు. ఇప్పుడేమో గ్యారెంటీలన్నీ గో విందా.. ప్రతి స్కీంలో మోసం.. ప్రతి విషయంలో దగా.. ఇదే కాంగ్రెస్ పాలన' అంటూ బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నిప్పులు చెరిగారు. శుక్రవారం సాయంత్రం మహబూబ్‌నగర్‌కు పోరుబాట బస్సుయాత్ర చేరుకున్నది. గడియారం చౌరస్తా వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగ్లో కాంగ్రెస్, బీజేపీలపై కేసీఆర్ విరుచుకుపడ్డారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలను విస్మరించాయన్నారు. కేవలం అధికారం కోసం అడ్డగోలు వాగ్దానాలు చేసి మోసం చేశారంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి అది చేస్తాం.. ఇది చేస్తాం అంటూ గ్యారెంటీలిచ్చింది. ఇప్పుడెవరికైనా రైతుబంధు వచ్చిందా? కల్యాణలక్ష్మి వచ్చిందా? రూ.2వేల పింఛన్ రూ.4వేలు అయ్యిందా? అని ప్రశ్నించారు. చోటేమియా, బడేమియాలకు ఓటేస్తే మనల్ని పాతాళానికి తొక్కుతారన్నారు. అచ్చేదినా..? సచ్చేదినా..? అంటూ దుయ్యబట్టారు. తెలంగాణ ప్రయోజనాలను తుంగలో తొక్కిన బీజేపీకి ఎందుకు ఓటెయ్యాలని ప్రశ్నించారు. 'ఒకవైపు తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతుంటే.. మరోవైపు ఆంధ్రకు నీళ్లు ఎత్తుకుపోతున్న వాళ్లకు ఇదే డీకే అరుణ రాయలసీమకు పోయి హారతులు పట్టింది.. అందుకు ఆమెకు ఓటేయాల్నా' అంటూ ప్రశ్నించారు. పాలమూరు ఎంతో వెనుకబడిందని.. ఇక్కడ కడుతున్న పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వాలని డిమాండ్ చేసినప్పటికీ కేంద్రం పట్టించుకోలేదన్నారు. డీకే అరుణ బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలే కదా? ఒక్కసారైనా జాతీయ హోదా ఇవ్వాలని కేంద్రాన్ని అడిగిందా? హోదా ఇప్పించే ప్రయత్నం చేసిందా? వీళ్లకా మనం ఓటేసేది? అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన వాగ్దానాలేవీ అమలు చేయలే.. స్కూటీలు రాలే కానీ లూటీ చేస్తున్నారని విమర్శించారు.

***నాశనం చేస్తుంటే చూస్తూ ఊరుకోను..***

'నాకండ్ల ముందే తెలంగాణను నాశనం చేస్తామంటే చూస్తూ ఊరుకోను. కేసీఆర్ యుద్ధం చేస్తడే తప్పా ఊరుకునే వ్యక్తి కాడు. చూస్తూ ఊరుకుందామా? యుద్ధం చేద్దామా? యుద్ధానికి అందరం సిద్ధమవుదామా?.. కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటే.. ప్రాంతీయ పార్టీల మనుగడ లేకుండా చేసేందుకు జాతీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. వీటిని తిప్పి కొట్టాలి' అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



క్లాక్‌టవర్ వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు వేలాదిగా తరలివచ్చిన బీఆర్ఎస్ నేతలు, అభిమానులు



# జనహోరు

## కేసీఆర్ బస్సు యాత్రకు నీరా'జనం'

- అడుగడుగునా మహిళల హారతులు
- దళపతి స్పీచ్‌కు కేరింతలు కొట్టిన జనం
- అశేష జనవాహినితో కిక్కిరిసిన క్లాక్‌టవర్
- భారీగా తరలివచ్చిన ప్రజానీకం
- కేసీఆర్ ప్రసంగానికి చప్పట్ల మోతలు
- సీఎం.. సీఎం అంటూ నినాదాల హోరు
- ట్రాఫిక్ నియంత్రణలో పోలీసుల విఫలం

***పాలమూరులో బస్సు యాత్ర హోరెత్తించింది.. గులాబీ దండు కదిలింది.. ఊరూవాడా కదిలొచ్చింది.. జనప్రవాహమై ప్రజానీకం కదం తొక్కింది.. అభిమానం నింగిని తాకగా.. రెట్టింపు ఉత్సాహంతో పార్టీ శ్రేణులు, ప్రజలు తరలివచ్చారు.. నినాదాలు, కేరింతలతో జిల్లా కేంద్రం హోరెత్తిపోయింది.. గులాబీ దళపతి కి బ్రహ్మరథం పట్టగా క్లాక్‌టవర్ కిక్కిరిసిపోయింది.. డోలు, డప్పు వాయిద్యాల మధ్య కళాకారులు స్వాగతం పలికారు. బీఆర్ఎస్ మహిళా నేతలు హారతులు పట్టారు. కేసీఆర్ జయహో.. జై తెలంగాణ నినాదాలతో మార్మోగింది. పాలమూరు పట్టణం గులాబీమయం కాగా కేసీఆర్ స్పీచ్‌తో ప్రతి గుండె చప్పుడు ప్రతిధ్వనించింది. అశేష జనవాహినితో కార్నర్‌మీటింగ్ గ్రాండ్ సక్సెస్ అయ్యింది.***

*- మహబూబ్ నగర్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

### కాంగ్రెస్‌లో గుబులు..

మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంపై గులాబీ దళం కన్నేసింది. ఈ నేపథ్యంలోని పట్టణంలో కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్ర విజయవంతమైంది. పాలమూరు జనసంద్రమైంది. వారం కిందట జిల్లాకేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు మించి కేసీఆర్ బస్సుయాత్రకు జనం రావడంతో ఆ పార్టీలో గుబులు మొదలైంది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక ఉక్కిరిబిక్కిరవుతున్నది. ఈ క్రమంలో అనవసరంగా హస్తం పార్టీకి ఓటేశామని జనం బాధపడుతున్నారు. వద్దురా బాబోయ్ కాంగ్రెస్ పాలన అంటూ బస్సుయాత్రలో నినదించడం ఒకింత ఆశ్చర్యానికి గురిచేసింది. మొత్తంగా కేసీఆర్ బస్సుయాత్ర పాలమూరు జిల్లాలో రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. బీజేపీ, కాంగ్రెస్‌కు మించి జనం హాజరు కావడంతో పార్టీ నాయకులు ఆనందంలో మునిగిపోయారు.

పాలమూరు ఉప్పొంగింది.. కేసీఆర్ చేపట్టిన పోరుబాట జనసంద్రమైంది.. అడుగడుగునా ఘన స్వాగతం.. జై తెలంగాణ నినాదాలతో పట్టణం హోరెత్తింది.. వద్దురా బాబు ఈ కాంగ్రెస్ పాలన.. అంటూ ఆగ్రహావేశాలు.. దారులన్నీ గులాబీమయం కాగా గడియారం చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ కిక్కిరిసిపోయింది. జనాలను అదుపు చేయడం పోలీసుల తరం కాలేదు. ఊహించని జనసంద్రంతో పోలీసు యంత్రాంగం ఉక్కిరిబిక్కిరైంది. ఇదే పాలమూరులో ఏప్రిల్ 19న సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు జనం నుంచి పెద్దగా స్పందన రాలేదు. కానీ కేసీఆర్ అడుగు పెట్టగానే గడియారం చౌరస్తా దద్దరిల్లింది. ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి అరగంటకు పైగా పట్టిందంటే ఎంత జనం వచ్చారో ఊహించవచ్చు. శుక్రవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన పోరుబాట బస్సుయాత్ర మహబూబ్‌నగర్‌లో కొనసాగింది. సాయంత్రం జిల్లాలోకి ప్రవేశించిన కేసీఆర్ బస్సు యాత్రకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు భారీగా చేశారు. జిల్లాలో గులాబీ బాస్ అడుగుపెట్టిన దగ్గరి నుంచి కార్నర్ మీటింగ్ స్థలం వరకు జడ్చర్ల, మహబూబ్‌నగర్ పట్టణాలు గులాబీమయమయ్యాయి. బస్సుయాత్ర షాద్‌నగర్, బాలానగర్, రాజాపూర్ మీదుగా జడ్చర్ల, పాలమూరుకు చేరుకున్నది. మార్గమధ్యంలో రాజాపూర్ మండలం మాచర్ల వద్ద కేసీఆర్ కొద్దిసేపు ఫుడ్ కోర్టులో టీ, స్నాక్స్ కోసం ఆగారు. అనుకోకుండా పార్టీ అధినేత కేసీఆర్ రావడంతో హోటల్ సిబ్బంది సైతం ఆశ్చర్యపోయారు. అధినేతను హోటల్ లోపలికి తీసుకెళ్లిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి బజ్జీలు తిని, చాయ్ తాగారు. తర్వాత 15 నిమిషాల పాటు పార్టీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డితోపాటు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలతో మాటామంతి నిర్వహించారు. జడ్చర్లకు బస్సుయాత్ర చేరుకోగా నేతలు స్వాగతం పలికారు. అక్కడి నుంచి భారీ కాన్వాయితో పాలమూరుకు యాత్ర చేరుకున్నది. జిల్లా కేంద్రంలో ఎనిమిది కిలోమీటర్ల ప్రధాన రహదారిపై గంటపాటు బస్సుయాత్ర కొనసాగింది. అప్పన్నపల్లి నుంచి మొదలైన యాత్ర ఏనుగొండ, శ్రీనివాస కాలనీ, పద్మావతి కాలనీ, మెట్టుగడ్డ, న్యూ టౌన్, బస్టాండ్ చౌరస్తా, అశోక్ టాకీస్ చౌరస్తా మీదుగా కార్నర్ మీటింగ్ నిర్వహించే గడియారం చౌరస్తాకు చేరుకున్నది.

***అధినేతపై పూల వర్షం***

బస్సుయాత్రకు జనం నుంచి అపూర్వ స్పందన లభించింది. పలు చౌరస్తాల్లో బస్సుపై నాయకులు, ప్రజలు పూల వర్షం కురిపించారు. డోలు, డప్పు వాయిద్యాలతో అధినేతకు కళాకారులు స్వాగతం పలికారు. న్యూటౌన్ చౌరస్తా వద్ద మాజీ మంత్రి సతీమణి శారదతో పాటు బీఆర్ఎస్ ఎంపీపీ, ఇతర మహిళానేతలు బస్సుకు గుమ్మడికాయతో దిష్టి తీసి బస్సు ముందు పగలగొట్టి కేసీఆర్‌కు హారతులు పట్టారు. జై కేసీఆర్, సీఎం .. సీఎం.. అంటూ నినదించారు.

***గులాబీమయమైన పాలమూరు..***

పట్టణంలో కేసీఆర్ బస్సుయాత్ర నేపథ్యంలో ప్రధాన రహదారి గులాబీమయమైంది. మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, అంజయ్యయాదవ్ భారీ సంఖ్యలో కార్యకర్తలతో కేసీఆర్‌కు స్వాగతం పలికారు. కార్యకర్తలు గులాబీ జెండాలు పట్టుకొని బస్సుయాత్ర వెంటే సాగగా కేసీఆర్ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అధినేతను చూడగానే జనం కేరింతలు కొట్టడం కనిపించింది. యాత్రలో ట్రాఫిక్‌ను నియంత్రించడంలో పోలీస్ యంత్రాంగం పూర్తిగా విఫలమైంది.

### సర్కారుకు బుద్ధి చెప్పాలి : శ్రీనివాస్ గౌడ్

అలవి కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని తుంగలో తొక్కిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. శుక్రవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. రైతుబంధు ఎక్కువ చేసి ఇస్తామని, పింఛన్లు నాలుగువేలు ఇస్తామని, కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీలిచ్చి అధికారంలో వచ్చిందన్నారు. పాలమూరు ప్రజలు కాంగ్రెస్ బూటకపు వాగ్దానాలను నమ్మి మోసపోయారన్నారు. నవంబర్‌లో పెళ్లి చేసుకోకండి.. డిసెంబర్‌లో పెళ్లి చేసుకోండి తులం బంగారం ఇస్తామన్నరు. డిసెంబర్‌లోనే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని మోసపూరిత వాగ్దానాలిచ్చి ప్రజల్ని వంచించిందని మండిపడ్డారు. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్లు అయ్యిందని.. ఈ ఎన్నికల్లోనైనా ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. చావు నోట్లో తలపెట్టి రాష్ట్రాన్ని సాధించి.. వెనుకబడిన మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేసి వలసలను నిర్మూలించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. 'గడియారం చౌరస్తా ఎట్లుండే.. ఎట్ల అయ్యింది.. కాంగ్రెస్ హయాంలో ఏమైనా అభివృద్ధి జరిగిందా? కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలి.. బీఆర్ఎస్ బలపర్చిన ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలి'' అని ఓటర్లను కోరారు.

17 నామినేషన్లు తిరస్కరణ

## 47 ఆమోదం

**ఈనెల 29 వరకు ఉపసం హరణకు గడువు**

రంగారెడ్డి, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : చేవెళ్ల లోక్‌సభ ఎన్నికకు దాఖలైన నామినేషన్లలో స్క్రూటినీ ప్రక్రియ అనంతరం అధికారులు 47 మంది అభ్యర్థులకు సంబంధించిన నామినేషన్లను ఆమోదించి.. 17 మంది నామినేషన్లను తిరస్కరించారు. ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేష న్లు స్వీకరించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ లతోపాటు వివిధ పార్టీలు, స్వతం త్ర అభ్యర్థులు కలిపి మొత్తం 64 మంది అభ్యర్థులు 88 నామినేషన్లను దాఖలు చేశారు. శుక్రవారం రాజేంద్రనగర్ ఆర్వో కార్యాలయంలో నిర్వహించిన నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియలో నిబంధనలకు అనుగుణంగా లేని 17 మంది అభ్యర్థుల నామినేషన్లను తిరస్క రించారు. ఈనెల 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉన్నది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఎన్నికల బరిలో ఎంత మంది ఉంటారన్నది తేలనున్నది.

# గులాబీమయం..

- షాద్‌నగర్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఘన స్వాగతం
- మహబూబ్‌నగర్‌లో జరిగిన రోడ్డు షోకు అధిక సంఖ్యలో తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

షాద్‌నగర్, ఏప్రిల్ 26 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు షాద్‌నగర్ బైపాస్ రోడ్డులో శుక్రవారం సాయంత్రం ఘన స్వాగతం లభించింది. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతమంతా జై తెలంగాణ.. జై కేసీఆర్ నినాదాలతో మార్మోగింది. కార్యకర్తల ఉత్సాహాన్ని గమనించిన కేసీఆర్ వారికి విజయ సంకేతాన్ని చూపుతూ అభివాదం చేశారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో ఉన్నారని.. కేసీఆర్ అంటేనే ఓ చరిత్ర, ఓ ధైర్యం, ఓ శక్తి అని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నరేందర్, కేశంపేట ఎంపీపీ రవీందర్‌యా దవ్, నారాయణరెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు మురళీధర్‌రెడ్డి, రంగయ్యగౌడ్, దేవేందర్‌యాదవ్, ఎజాజ్‌అడ్డు, గణేశ్‌నాయక్, శ్రీనివా స్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.




షాద్‌నగర్ బైపాస్ రోడ్డులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

# అధినేత వస్తున్నారహో..

- నేడు కందనూలులో కార్నర్ మీటింగ్
- ప్రసంగించనున్న గులాబీ బాస్ కేసీఆర్
- బస్సు యాత్ర సక్సెస్‌కు ఏర్పాట్లు
- స్వచ్ఛందంగా తరలొచ్చేందుకు సిద్ధమైన ప్రజలు

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : కందనూలులో నేడు గులాబీ దళపతి అడుగుపెట్టనున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతుగా మూడురోజుల కిందట బస్సు యాత్రగా బయలుదేరిన కేసీఆర్ శనివారం సాయంత్రం నాగర్‌కర్నూల్‌కు చేరుకుంటారు. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారంలో ఉన్న పార్టీ శ్రేణుల్లో కేసీఆర్ రాక సరికొత్త ఉత్సాహాన్ని నింపనున్నది. కాంగ్రెస్‌పై పెరిగిన వ్యతిరేకతతో ప్రజలు కేసీఆర్ యాత్రకు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధమయ్యారు.

***నేడు గులాబీ దళపతి రాక..***

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శనివారం నాగర్‌కర్నూల్‌కు వస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మాజీ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఖరారు చేయగా ఆయన ప్రచారంలో దూసుకెళ్తున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇప్పటికే సమావేశాలు నిర్వహించి శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపారు. ఈ క్రమంలో స్వయంగా కేసీఆర్ నాగర్‌కర్నూల్‌కు రానుండడం పార్టీ గ్రామస్థాయి నాయకుల్లోనూ జోష్‌ను నింపుతున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో 420హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అసలు రూపాన్ని నాలుగు మాసాల్లోనే ప్రజలు గ్రహించారు. దీంతో ఆ పార్టీకి గుణపాఠం చెప్పేందుకు పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ మద్దతుతో బరిలో నిలిచిన ఆర్ఎస్ ప్రవీణ్‌ను స్వచ్ఛందంగా ఆదరిస్తున్నారు. మూడు రోజుల కిందట మిర్యాలగూడలో ప్రారంభమైన బస్సు యాత్ర శుక్రవారం రాత్రి మహబూబ్‌నగర్‌కు చేరుకున్నది. శనివారం సాయంత్రం 6గంటల వరకు కేసీఆర్ కందనూలుకు రానున్నారు. ఉయ్యాలవాడ నుంచి భారీ ఊరేగింపును నిర్వహించనుండగా.. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్ పర్యటనను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద కార్నర్ మీటింగ్‌లో కేసీఆర్ ప్రసంగించనుండగా.. నియోజకవర్గం నుంచి 50వేల మంది ప్రజలు వచ్చే అవకాశమున్నది. కేసీఆర్ నాగర్‌కర్నూల్ వస్తున్నారని తెలిసిన వెంటనే పార్టీ నాయకులు సోషల్‌మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రజలు భారీగా తరలివచ్చేలా సన్నాహాలు చేస్తున్నారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత మొదలై బీఆర్ఎస్‌పై విశ్వాసాన్ని తిరిగి తీసుకొచ్చింది. ఈ నాలుగు మాసాల్లో నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరుగకపోవడంతో ప్రజలు తీవ్ర నిరుత్సాహంలో ఉన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకొచ్చి, పదేండ్లపాటు అభివృద్ధి చేసిన కేసీఆర్ రాక కోసం కందనూలు ప్రజలు ఎదురు చూస్తున్నారు.